సాక్షి ఆదిలాబాద్

ఆదివారం। 13। ఏప్రిల్। 2025



జైఆంజనేయం..

హనుమాన్ జయంతిని జిల్లా కేంద్రంలో శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. ప్రత్యేక పూజల అనంతరం భజన సంకీర్తనలు, శోభాయాత్రలు చేపట్టారు. హిందూవాహిని, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన శోభాయాత్రను ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే శంకర్ ప్రారంభించారు. శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఈ యాత్ర సాగింది. ఇందులో మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద, సామాజిక కార్యకర్త మౌనిష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నేరడిగొండ మండలకేంద్రంతోపాటు చించోలి, తేజాపూర్ గ్రామాల్లో గల హనుమాన్ ఆలయాల్లో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పూజలు నిర్వహించారు. జిల్లాకేంద్రంలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈమేరకు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సిబ్బందితో మధ్యాహ్నం సమావేశమై వారికి దిశానిర్దేశం చేశారు. - ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్/నేరడిగొండ


పల్లకి శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్


చించోలి హనుమాన్ ఆలయం వద్ద ఎమ్మెల్యే అనిల్ జాదవ్


జిల్లా కేంద్రంలో నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


రాంనగర్‌లోని శ్రీ హనుమాన్ ఆలయంలో భక్తుల పూజలు

న్యూస్‌రీల్

ల్యాబ్ టెక్నీషియన్ల డిప్యూటేషన్ రద్దు

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్‌టౌన్: వైద్య శాఖ లో అక్రమ డిప్యూటేషన్లు శీర్షికన 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనానికి డీ ఎం హెచ్‌వో నరేందర్ రాథోడ్ స్పందించారు. డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు సొంత పీహెచ్‌సీలకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేశారు. వారి డిప్యూటేషన్ రద్దు చేయాలని కార్యాలయ సూపరింటెండెంట్‌కు సూచించారు. జిల్లా కేంద్రంలోని టీబీ సెంటర్‌లో పనిచేస్తున్న ల్యాబ్‌టెక్నీషియన్లు, మలేరి యా విభాగంలో పనిచేస్తున్న మరో ఇద్దరు, టీ హబ్‌లో పనిచేస్తున్న ఒకరి డిప్యూటేషన్ రద్దు చేసి శనివారం రిలీవ్ చేశారు. మిగతా వారిని పరిశీలించి త్వరలోనే వారి డిప్యూటేషన్ కూడా రద్దు చేస్తామని డీఎంహెచ్‌వో వివరించారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

ఆదిలాబాద్‌టౌన్: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన వార్షికోత్సవానికి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చదువు లేకుంటే ఏమి సాధించలేమని పేర్కొన్నారు. ప్రతీ విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ముందుగా కళాశాలలో సెమినార్ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం, వైస్‌ప్రిన్సిపాల్ రఘు గణపతి, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ స్వామిని దర్శించుకున్న ఎస్పీ


ఎస్పీని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం దర్శించుకున్నారు. తన తల్లితో కలిసి ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకుడు వెంకటరమణాచారి ఆలయ విశిష్టతను వివరించారు. ఎస్పీ వెంట జైనథ్ సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం, మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్, పాలకవర్గ సభ్యులు తదితరులు ఉన్నారు.


'డయల్ యువర్ డీఎం'కు స్పందన

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి స్పందన లభించింది. డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ప్రయాణికుల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, ఫిర్యాదులు, సమస్యలను నమోదు చేసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఆదిలాబాద్ నుంచి కిరణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో సిటీ బస్సులు ప్రారంభించాలని కోరగా, వెంటనే ప్రారంభించలేమని, పట్టణంలోని రహదారులకు అనుగుణంగా మినీ బస్సుల కేటాయింపు జరిగితే ఈ దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. బజార్‌హత్నూర్ నుంచి రాజన్న మాట్లాడుతూ సొనాల- బజార్‌హత్నూర్ మధ్య మరిన్ని సర్వీసులు పెంచాలని కోరగా, ప్రస్తుతం ఏడు ట్రిప్పులు నడుపుతున్నామన్నారు. సామర్థ్యానికి అనుగుణంగా పెంచే ప్రయత్నం చేస్తామన్నారు. అర్లి నుంచి గణపతి మాట్లాడుతూ లాండసాంగ్వి మీదుగా బేలకు వెళ్లేందుకు మరిన్ని బస్సులను ఆపరేట్ చేయాలని కోరగా, ఈ దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇంద్రవెల్లి నుంచి బాలాజీ మాట్లాడుతూ ఆదిలాబాద్ -ఉట్నూర్ నడుమ 9 గంటలకు సైతం బస్సు సర్వీస్ ఏర్పాటు చేయాలని కోరగా, గతంలో ఇదే సమయంలో సర్వీస్ నడిపామని, ట్రాఫిక్ మేరకు మరోసారి పరిశీలిస్తామన్నారు.

వనజీవి రామయ్య జీవితం ఆదర్శనీయం

ఆదిలాబాద్‌టౌన్: ఖమ్మం జిల్లాకు చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య మృతిపై మాజీ మంత్రి జోగు రామన్న ప్రకటనలో సంతాపం తెలిపారు. తన జీవితకాలం చెట్లను గౌరవిస్తూ కోట్ల సంఖ్యలో మొక్కలు నాటడమే కాకుండా, వాటికి పూజ చేయడం వంటివి ఎన్నో స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలు చేపట్టిన ఆయన జీవితం ఆదర్శనీయమని కొనియాడారు.

ఏడున్నడో.. ఎట్లున్నడో?


మైలారపు అడెల్లు (ఫైల్)


బోథ్ మండలంలోని ఓ గ్రామంలో పోలీసులు అతికించిన పోస్టర్ (ఫైల్)

- మూడు దశాబ్దాలుగా అజ్ఞాతంలోనే 'మైలారపు'
- 'కగార్' పేరిట కేంద్రం ఆపరేషన్
- ఇప్పటికే భారీగా మావోల మృతి
- 'అడెల్లు'ను లొంగిపోవాలంటున్న కుటుంబ సభ్యులు

బోథ్: దేశంలో మావోయిస్టులను పూర్తిస్థాయిలో అంతమొందించాలని కేంద్రం నిర్ణయించింది. కగార్ పేరిట ప్రత్యేక ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా చత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, మహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రత్యేక బలగాలు జల్లెడ పడుతున్నాయి. నాలుగు నెలలుగా ఆయా రాష్ట్రాల్లో వరుస ఎన్‌కౌంటర్లు చోటు చేసుకోగా.. సుమారు రెండు వందల మందికి పైగా మావోయిస్టులు మృతి చెందారు. చత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంతో పాటు రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లా సమీపంలోని అడవుల్లో పోలీసు బలగాలు అణువణువు గాలిస్తున్నాయి. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో మావోయిస్టులకు ఇబ్బందికర పరిస్థితులున్నాయి. అయితే శాంతి చర్చలు జరపాలని వారు ఓ లేఖను విడుదల చేశారు. మరోవైపు ఇటీవల ఏప్రిల్ 5న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 86 మంది పోలీసుల ఎదుట లొంగిపోయారు.

ఇదే జిల్లాలో గత నెలలో 64 మంది లొంగిపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ ఆచూకీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కుటుంబసభ్యుల్లో ఆందోళన వ్యక్తమవుతుండగా.. ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా వారు ఆరా తీస్తున్నారు. ఆయా సందర్భాల్లో జిల్లావాసులు సైతం అడెల్లు ప్రస్తావనే వినిపిస్తుంది.

కుటుంబ నేపథ్యం..

ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన మైలారపు పోతన్న-పోషవ్వ దంపతులకు నలుగురు సంతానం. వీరిలో పెద్ద అడెల్లు, సీతారాం, అడెల్లు, చిన్న అడెల్లు. కూలీనాలి చేసుకుని జీవనం సాగించే తల్లిదండ్రులు కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. అడెల్లు సోదరులైన పెద్ద అడెల్లు తనకున్న మూడెకరాలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మరో ఇద్దరు సోదరులు సీతారాం వ్యవసాయం చేస్తుండగా, చిన్న అడెల్లు కూలి పనులకు వెళ్తున్నాడు.

పేదరికం నుంచి నక్సల్‌బరివైపు..

పేదరికమే అడెల్లును అజ్ఞాతం వైపు మరల్చింది. భూమి లేని నిరుపేద కుటుంబంలో పుట్టిన ఆయనను 1989లో ఉధృతంగా సాగిన భూపోరాటం ఆకర్షించింది. 'దున్నేవాడిదే భూమి' నినాదం నక్సల్‌బరి వైపు నడిపించింది.

లొంగిపో తమ్ముడా..



మా తమ్ముడు అడెల్లు చదువులో చాలా తెలివిమంతుడు. అప్పట్లోనే రైల్వేలో ఉద్యోగం వచ్చింది. ముప్పై ఏళ్ల క్రితం దళంలోకి వెళ్లాడు. అప్పటి నుంచి చూడలే దు. ఎక్కడ ఉన్నాడో.. ఎలా ఉన్నాడో తెలి యడం లేదు. ఒక్కసారైనా కనిపించకపోతాడా అన్న నమ్మకంతో ఉన్నాం. ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా ఏ వార్త వినాలో అని మా కు భయమేస్తుంది. లొంగిపోవాలని కోరుకుంటున్నాం. అడెల్లు మాతో ఉంటే మేము ధీమాతో బతుకుతాం.

– మైలారపు పెద్ద అడెల్లు(అడెల్లు సోదరుడు)

దళంలోనే లింగవ్వతో వివాహం..

అడెల్లు దళంలో చేరిన సందర్భంలోనే నిర్మల్ జిల్లా కడెం మండలం లక్ష్మీసాగర్ గ్రామానికి చెందిన కంతి లింగవ్వతో వివాహం జరిగింది. అప్పటికే లింగవ్వ దళంలో ఉన్నారు. ఆమె జిల్లా కమిటీ సభ్యురాలిగా కీలకంగా వ్యవహరించారు. మంగీ ప్రాంతంలో ఎక్కువగా రిక్రూట్‌మెంట్ చేసినట్లు తెలుస్తోంది. 2022 డిసెంబర్‌లో మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆమె మృతి చెందారు. అప్పటి నుంచి అడెల్లు చత్తీస్‌గఢ్ దండకారణ్యంలోకి వెళ్లారని తెలుస్తోంది.

మూడు దశాబ్దాలుగా అజ్ఞాతంలోనే..

మూడుదశాబ్దాలుగా అజ్ఞాతానికే పరిమితమైన అడెల్లు ఎట్లున్నడో, ఎక్కడున్నడో అంటూ వారి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 30 ఏళ్ల క్రితం చూసిన ముఖమే ఇప్పటికీ తమ కళ్లల్లో మెదులుతున్నట్లు చెబుతున్నారు. అమ్మానాన్న ఇప్పటికే లోకం విడిచారని, అడెల్లు అజ్ఞాతం వీడి రావాలని ఆయన సోదరులు, కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రతీసారి ఏ వార్త వినాల్సి వస్తోందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడెల్లు దళంలోకి వెళ్లిన తరువాత తాము గ్రామాన్ని వదిలాల్సి వచ్చిందని, ప్రతిరోజు ఎవరో ఒకరు వచ్చి ఇబ్బంది పెట్టేవారని వివరించారు. పదేళ్ల నుంచి మళ్లీ గ్రామంలోనే ఉంటున్నామని వెల్లడించారు.

రాడికల్ యూనియన్ నుంచి దళంలోకి..

పేదరికం కారణంగా అడెల్లు చిన్నతనం నుంచి తల్లిదండ్రులు, సోదరులతో కలిసి వ్యవసాయ కూలీ పనులకు వెళ్లేవాడు. ఈ సమయంలో 'సాగు పనులు చేసే మాకేమో భూమి లేదు.. వాళ్లకేమో వందల ఎకరాలు ఎందుకంటూ' తరచూ ప్రశ్నించేవాడు. బోథ్ మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివిన అడెల్లు 1989లో నిర్మల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో చేరాడు. ఆ సమయంలో భూపోరాటాలు ఉధృతంగా సాగుతున్నాయి. అభ్యుదయ భావాలు కలిగిన ఆయన రాడికల్ స్టూడెంట్ యూనియన్‌లో చేరాడు. అధ్యక్షుడిగా పనిచేశాడు. గ్రామాల్లో తిరుగుతూ ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు యత్నించాడు. 1994–95 సమయంలో నక్సలైటుగా మారాడు. మొదట బోథ్ దళ సభ్యుడిగా అరంగేట్రం చేశాడు. ఇంద్రవెల్లి డిప్యూటీ కమాండర్ స్థాయికి ఎదిగాడు. అక్కడి నుంచి చత్తీస్‌గఢ్ దండకారణ్యంలోకి మారాడు. పాతికేళ్ల వయసులో దళంలో చేరిన ఆయనకు ప్రస్తుతం 55 ఏళ్ల వరకు ఉండొచ్చని చెబుతుంటారు. ఆదిలాబాద్ జిల్లాపై ఆయనకు పూర్తిస్థాయిలో పట్టుంది. కరోనా సమయంలో జిల్లాలో రిక్రూట్‌మెంట్ కోసం తిరిగినట్లు సమాచారం. ప్రస్తుతం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, అలాగే కుమురంభీం, మంచిర్యాల డివిజన్ కమిటీకి సారథ్యం వహిస్తున్నాడు. గతంలో ఈయన దళాన్ని పట్టుకోవడమే లక్ష్యంగా పోలీసులు ఉమ్మడి జిల్లాలోని తిర్యాణి, మంగి, బోథ్, పెంబి, ఖానాపూర్, మామడ ప్రాంతాలను జల్లెడ పట్టారు. పలుమార్లు చిక్కినట్టే చిక్కి తప్పించుకున్నట్లు తెలిసింది. 2020 సెప్టెంబర్19న కదంబ అడవిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో తృటిలో తప్పించుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం అడెల్లుపై రూ.20 లక్షల రివార్డు ఉంది.

ఎంప్యానోల్‌మెంట్!

- ఆ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలంటేనే మమకారం
- దూరం చేసుకునేందుకు ఇష్టపడని ఆఫీసర్లు
- గతనెలతో ముగిసిన ఎంప్యానల్‌మెంట్ గడువు
- కొత్తది ఏర్పాటులో తాత్సారం



సాక్షి,ఆదిలాబాద్: సాధారణంగా ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల గుర్తింపునకు సంబంధించి ఎంప్యానల్‌మెంట్ గడువు ఏడాది ఉంటుంది. లేనిపక్షంలో రెండేళ్ల పాటు కొనసాగిస్తారు. అయితే జిల్లాలో మాత్రం చిత్రమైన పరిస్థితి ఉంది. ఐదేళ్లుగా ఒకే ఎంప్యానల్‌మెంట్ కొనసాగుతుంది. అందులోని ఏజెన్సీలను వివిధ శాఖల అధికారులు 'నిను వీడను' అన్నట్లుగా వాటిని వదులుకునేందుకు ఇష్టపడటం లేదు. తాజాగా గత నెలతో గడువు ముగిసినా కొత్త ఎంప్యానల్‌మెంట్ విధివిధానాలు రూపొందించే విషయంలో జిల్లా ఉపాధి కల్పన అధికారికి ఫైలు రాసేందుకు చెయ్యే ముందుకు కదలడం లేదు. దీన్ని బట్టే ఆఫీసర్లకు ఈ ఏజెన్సీలంటే ఎంత మక్కువో తెలిసిపోతుంది.

ప్రభుత్వ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ సర్వీసులను ఏజెన్సీలు చేపడతాయి. ఆ ఏజెన్సీలకు వీటి నియామక ప్రక్రియ అప్పగించేందుకు ముందుగా అవి ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందాలి. దాన్నే ఎంప్యానల్‌మెంట్ అంటారు. ఈ ఎంప్యానల్‌మెంట్ గడువు ఏడాది, లేనిపక్షంలో రెండేళ్లలో పూర్తవుతుంది. మళ్లీ కొత్తది రూపొందించి వివిధ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు అవకాశం కల్పించాలి. అయితే ప్రస్తుతం కొనసాగుతున్న ఏజెన్సీలను వివిధ శాఖల అధికారులు ఏళ్లకేళ్లుగా విడిచిపెట్టేందుకు ఇష్టపడటం లేదు. దీనికి కారణం లేకపోలేదు. సాధారణంగా ఔట్‌సోర్సింగ్ అంటేనే ప్రభుత్వం నుంచి వచ్చే వర్క్ ఆర్డర్లను ఏజెన్సీలకు పంచడం, కొత్త పోస్టులు మంజూరైతే వాటి నియామకాలు చేపట్టడం వంటి వ్యవహారాల్లో ఇటు నిర్వాహకులు, అటు ఆఫీసర్లు మిలాఖతై వ్యవహారాన్ని నడుపుతూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఈ వ్యవహారాన్ని నిరోధించాల్సిన ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

సమయం దొరకడం లేదా..!

ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు సంబంధించిన వ్యవహారాలన్నీ జిల్లా ఉపాధికల్పన శాఖ కార్యాలయం నుంచి సాగుతాయి. వర్క్ ఆర్డర్ కూడా ఇక్కడినుంచే కేటాయిస్తారు. ఆ తర్వాత ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల్లో ఆయా శాఖల అధికారులు, జిల్లా ఉపాధికల్పన అధికారి, ఏజెన్సీల పర్యవేక్షణలో సాగుతాయి. ఇదిలా ఉంటే జిల్లాలో 2019–20లో ఎంప్యానల్‌మెంట్ ఏర్పాటుకు సంబంధించి టెండర్లు నిర్వహించారు. ఆ తర్వాత ఒకటిరెండేళ్లకు మళ్లీ నిర్వహించాల్సి ఉండగా, ఆఫీసర్లు ఆ ప్రక్రియనే పూర్తిగా మర్చిపోయారు. ఐదేళ్లు దాటినా పాత ఏజెన్సీలతో కూడిన ఎంప్యానల్‌మెంటే కొనసాగుతుంది. అప్పట్లో 17 ఏజెన్సీలను గుర్తించగా, ప్రస్తుతం 9 ఏజెన్సీలు యాక్టీవ్‌గా ఉన్నాయి. వాటినే కొనసాగిస్తూ వస్తున్నారు. ఇదిలా ఉంటే కొత్త ఎంప్యానల్‌మెంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని గత నెల 'సాక్షి' వివరణ కోరినప్పుడు జిల్లా ఉపాధికల్పన అధికారి మిల్కా సమాధానం ఇచ్చారు. ఆ గడువు ముగిసినా విధివిధానాల రూపకల్పన చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. అయితే ఈ వ్యవహారంలో ఉన్నతాధికారులు సైతం పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఏజెన్సీల వద్ద ఉన్న ఔట్‌సోర్సింగ్ పోస్టుల సంఖ్య..

ఏజెన్సీ పేరు	పోస్టుల సంఖ్య
మహాలక్ష్మి మ్యాన్‌పవర్	418
దుర్గం ఎస్సీ లేబర్ కాంట్రాక్ట్ సొసైటీ	392
జీపీ ఇన్ఫోటెక్	149
ఎలైన్‌సాఫ్ట్	118
శక్తి సెక్యూరిటీ అండ్ మెయింటనెన్స్	50
శ్రీసాయి యూత్ అసోసియేషన్	46
శ్రీ విజయలక్ష్మి సోషల్ వెల్ఫేర్ సొసైటీ	24
ప్రణయాన్ హౌస్‌కీపింగ్ సెక్యూరిటీ	24
శ్రీసాయి పంజా మ్యాన్‌పవర్	15

ఈనెల 15లోగా ఫైల్ రెడీ..

కొత్త ఎంప్యానల్‌మెంట్ ఏర్పాటు కోసం ఈనెల 15లోగా ఫైల్ సిద్ధం చేస్తాం. విధివిధానాలు రూపొందించి ముందుకెళ్తాం. త్వరలోనే కొత్త ఎంప్యానల్‌మెంట్ రూపొందించేలా చర్యలు చేపడతాం.

– మిల్కా, ఇన్‌చార్జి జిల్లా ఉపాధికల్పన శాఖ అధికారి

ప్రయాణికులకు మెరుగైన సేవలు

- నాందేడ్ డీఆర్ఎం ప్రదీప్ కామ్లే
- ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ సందర్శన


డీఆర్ఎంతో చర్చిస్తున్న ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: రైల్వే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నామని నాందేడ్ డీఆర్ఎం ప్రదీప్ కామ్లే అన్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. అమృతభారత్ స్టేషన్, పిట్‌లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ రఘుపతి స్థానిక రైల్వే సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందించారు. అనంతరం డీఆర్ఎం మాట్లాడుతూ, స్థానిక సమస్యలను పరిశీలించి డివిజనల్ స్థాయిలో పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు. అలాగే జిల్లా కేంద్రంలో నిర్మితమవుతున్న అండర్, ఓవర్ బ్రిడ్జి పనులు, పిట్‌లైన్, అమృత్ భారత్ స్టేషన్ పనులు వేగవంతంగా సాగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీ నగేశ్ మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని రైల్వేకి సంబంధించిన పలు అంశాలను డీఆర్ఎం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. వాటిపై ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలోని రైల్వే వంతెనల నిర్మాణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఆలస్యం అవుతుందన్నారు. నిధుల కేటాయింపులు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా చెల్లించేలా రైల్వే మంత్రి దృష్టికి సైతం తీసుకువెళ్లామన్నారు. వీలైనంత త్వరగా ఈ సమస్యలన్నీ పరిష్కారం అయ్యేలా తోడ్పాటు అందించాలని కోరామన్నారు. ఇందులో రైల్వే అధికారులు, పలువురు బీజేపీ నాయకులు ఉన్నారు.

'గడ్డి మందు'పై పోరాటం

- పారాక్వాట్ నిషేధానికి డాక్టర్ల సంఘం ఏర్పాటు


సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: దేశంలో ఎంతోమంది నిండు ప్రాణాలను బలితీసుకుంటున్న గడ్డి మందు (పారా క్వాట్) నిషేధమే లక్ష్యంగా పోరాటానికి ఓ సంఘం ఏర్పాటైంది. రాష్ట్రంలో పలువురు ప్రైవేటు వైద్యులు కలిసి 'డాక్టర్స్ అసోసియేషన్ అగెనెస్ట్ పారాక్వాట్ పాయిజనింగ్' పేరుతో ఓ సొసైటీని రిజిస్ట్రేషన్ చేయించారు. మంచిర్యాల కేంద్రంగా కార్యకలాపాలు సాగించనున్న ఈ సంఘానికి అధ్యక్షుడిగా ఖమ్మంకు చెందిన డాక్టర్ సతీశ్ నారాయణచౌదరి, ఉపాధ్యక్షుడిగా మంచిర్యాలకు చెందిన డాక్ట రాకేశ్ చెన్న, ప్రధాన కార్యదర్శిగా వరంగల్‌కు చెందిన డాక్టర్ మానస మామిడాలతో సహా మరో ఆరుగురి వైద్యులతో కార్యవర్గం ఏర్పడింది. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ క్షణికావేశంలో గడ్డి మందు తాగి చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. అనేక దేశాల్లో నిషేధించినా ఇక్కడ విరివిరిగా వాడకంతో అనర్థాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విష రసాయన అమ్మకాలు నిలిపివేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేసేలా అన్ని రకాల ప్రయత్నాలు చేస్తామని తెలిపారు. ఈ పోరాటానికి స్వచ్ఛంద సంస్థలు, పౌరులు తమతో కలసి రావాలని కోరారు.

క్లుప్తంగా

మొక్కజొన్న పంట దగ్ధం


దగ్ధమైన మొక్కజొన్న

ఇచ్చోడ: మండలంలోని దూబార్‌పేట్ శివారులో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మొక్కజొన్న పంట దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. జామిడి గ్రామానికి చెందిన రైతు తోరే సుభాష్ దూబార్‌పేట్ శివారులో రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నాడు. శనివారం ప్రమాదవశాత్తు పొలం చుట్టూ ఒక్కసారి మంటలు చెలరేగి మొక్కజొన్న పంటకు వ్యాపించాయి. గంట వ్యవధిలో కాలిబూడిదైంది. మరో వారంలో చేతికందే పంట కళ్ల ముందే దగ్ధమవడంతో బాధిత రైతు కన్నీరుమున్నీరుగా విలపించాడు. దాదాపు రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలిపాడు.

బాలికపై లైంగికదాడి

దహెగాం: బంధువుల ఇంటికి వచ్చిన బాలికపై కామాంధుడు కన్నేసి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలికకు వరుసకు మామ అయిన వ్యక్తి ఈ దారుణానికి ఒడిగట్టాడు. ఎస్సై కందూరి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(13) ఈనెల 7న దహెగాం మండలంలోని ఓ గ్రామంలో మేనత్త ఇంటికి వచ్చిందని తెలిపారు. అదే రోజున వరుసకు మామ అయిన బండి రవీందర్ బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. బాలిక స్వగ్రామానికి వెళ్లిపోగా నీరసంగా ఉండడంపై తల్లిదండ్రులు ఆరాతీశారు. జరిగిన విషయం చెప్పడంతో శనివారం బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు బండి రవీందర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

నిద్రిస్తున్న వృద్ధురాలిపై హత్యాయత్నం

సోన్: నిద్రిస్తున్న వృద్ధురాలిపై ఇద్దరు హత్యాయత్నం చేసిన ఘటన మండలంలోని గంజాల్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. గంజాల్ గ్రామంలోని వడ్డెర కాలనీకి చెందిన సంపంగి గంగామణి(60) శుక్రవారం రాత్రి నిద్రిస్తోంది. అదే కాలనీకి చెందిన శ్రీకాంత్, సాయి ఆమెపై బండరాయి పడేసి పరిగెత్తారు. ఆ సమయంలో స్థానికులు కొమర శ్రీకాంత్, మొక్కల సాయిలు వారిని గుర్తించారు. శ్రీకాంత్, సాయితో గంగామణికి పాత గొడవలు కారణంగా ఆ ఇద్దరు ఆమెపై హత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపి తెలిపారు. కాగా, గాయపడిన వృద్ధురాలు నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది.

నేడు పర్ధాన్ సమాజ్ అత్యవసర సమావేశం

ఇంద్రవెల్లి: ఉమ్మడి జిల్లా పర్ధాన్ సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం ఇంద్రవెల్లి మండలకేంద్రంలో ఉమ్మడి జిల్లా అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు గేడం భారత్ తెలిపారు. మండలకేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాగ్నే ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11:30 గంటలకు సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి పర్ధాన్ సమాజ్ పెద్దలు, ఉద్యోగులు, మేధావులు, రాజకీయ నాయకులు, యువకులు తరలిరావాలని కోరారు. నాయకులు జ్ఞానేశ్వర్, ఆర్క ఖమ్ము, సోయం మురహరి పాల్గొన్నారు.

‘అపూర్వ’ సమ్మేళనం

- 1980 నుంచి ఇప్పటి వరకు ఆయా బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు హాజరు
- ప్రభుత్వ సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో సంబురం


సెల్ఫీ దిగుతూ..

ఆదిలాబాద్‌టౌన్: వారంతా ఒకేచోట చదువుకున్న మిత్రులు.. పదో తరగతి పూర్తయ్యాక జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ కోర్సుల్లో చేరారు. చదువు పూర్తయిన తర్వాత ఎవరిదారిలో వారు వెళ్లారు. ఇంజినీర్లు, సైంటిస్టులు, లెక్చరర్లతో పాటు వివిధ హోదాల్లో, మరికొందరు సర్కారు కొలువుల్లో ఉండగా, ఉద్యోగ విరమణ పొందారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా 45 ఏళ్ల తర్వాత మళ్లీ చదువులమ్మ ఒడిలో కలుసుకున్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి చిలిపి, అల్లరిచేష్టలు, మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. వారు చదువుకున్న తరగతి గదుల్లో కూర్చొని ఒక్కసారి పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. రోజంతా ఉల్లాసంగా గడిపారు. ఈ అపురూపమైన ఘట్టానికి ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాల వేదికైంది. కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూర్వ విద్యార్థులందరు ఒకేచోట చేరడంతో సందడి వాతావరణం నెలకొంది. ప్రస్తుతం ఏం చేస్తున్నారు.. ఎక్కడ ఉంటున్నారు.. ఇక నుంచి టచ్‌లో ఉండాలంటూ ఫోన్ నంబర్లు తీసుకోవడంతో పాటు ఈ మధుర జ్ఞాపకా లను సెల్‌ఫోన్లు, కెమెరాల్లో బంధిస్తూ సెల్ఫీలు దిగా రు. పూర్వ విద్యార్థుల కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.

1980 నుంచి ఇప్పటివరకు..

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 1980లో ఏర్పడింది. ఇక్కడ మెకానిక్ సివిల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్, డీసీసీపీ ఇతర కోర్సుల్లో బోధన చేపడుతున్నారు. మొదటి బ్యాచ్ నుంచి ఇప్పటి వరకు చదువుతున్న పూర్వ విద్యార్థులు ఒకే చెంతకు చేరారు. గత రెండేళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహించేందుకు పూర్వ విద్యార్థుల శ్రమ ఎంతగానో ఉంది. వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానం పంపారు. దాదాపు 600 మంది పూర్వ విద్యార్థులు చేరుకున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందినవారు 250 మంది వరకు ఉండగా రాష్ట్రాలు, జిల్లాలు, దుబాయ్ నుంచి 62 ఏళ్ల రహీమొద్దీన్ హాజరయ్యారు. శ్రీహరికోటలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్న చంద్రశేఖర్, సెక్రెటరి టు గవర్నమెంట్ లా డిపార్ట్‌మెంట్‌కు చెందిన రేండ్ల తిరుపతి తన అభినందన పత్రాన్ని పంపించారు. నిర్మల్ డీఎఫ్‌వో రమేశ్‌రావు, హైదరాబాద్‌లోని టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్ వసంత్‌రావు, జీహెచ్‌ఎంసీలో రిటైర్డ్ ఏఈ రఘునందన్, రిటైర్డ్ ప్రిన్సిపాల్లు ఎల్లారెడ్డి, బాల నర్సిములు, నిరంజన్, రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ చల్ల విజయ్‌బాబుతో పాటు ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, వివిధ హోదాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు అభయ్ రాజు, రిటైర్డ్ లెక్చరర్ విజయ్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

‘మలేరియా’లో బినామీ ల్యాబ్‌టెక్నీషియన్


రిపోర్టు అందజేస్తున్న బినామీ ల్యాబ్‌టెక్నీషియన్


రిజిస్టర్‌లో సదరు ఉద్యోగి పేరు లేని దృశ్యం

- ఏళ్లుగా పత్తాలేని అసలు ఉద్యోగి
- వేలల్లో వేతనం తీసుకుంటూ విధులకు ఎగనామం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో గల మలేరియా విభాగంలో ఓ ల్యాబ్ టెక్నీషియన్ ఏళ్లుగా విధులకు ఎగనామం పెడుతున్నాడు. ప్రైవేట్ వ్యక్తిని బినామీ ల్యాబ్ టెక్నీషియన్‌గా ఏర్పర్చుకొని ఆయన ద్వారానే పనులు కానిచ్చేస్తున్నాడు. గత 13 ఏళ్లుగా విధులకు హాజరుకావడం లేదని పలువురు పేర్కొంటున్నారు. జైనథ్ పీహెచ్‌సీలో ల్యాబ్‌టెక్నీషియన్‌గా పనిచేస్తున్న సదరు ఉద్యోగి రిమ్స్‌లో డిప్యూటేషన్‌పై ఉన్నాడు. ప్రైవేట్ ల్యాబ్‌లో పనిచేసే వ్యక్తితో వ్యవహారం కొనసాగిస్తున్నాడు. ఏళ్లుగా ఈతంతు సాగుతున్నా ఆ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోగులతో ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనుభవం లేని ప్రైవేట్ వ్యక్తులను సొంతగా నియమించుకుని మలేరియా టెస్టులు చేయిస్తున్న సమయంలో రిపోర్టులో ఎలాంటి పొరపాట్లు జరిగినా రోగులు ఇబ్బందులు పడాల్సిందే. పాజిటివ్‌కు బదులు నెగెటివ్, నెగెటివ్‌కు బదులు పాజిటివ్ వచ్చినా సమస్య ఎదురవుతుంది. అయితే గతనెలలో ‘సాక్షి’లో ‘ఒకరికి బదులు’ అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో ఆయన అప్పట్లో చేసిన బినామీ ఉద్యోగిని తప్పించి మళ్లీ కొత్త వ్యక్తిని సొంతగా నియమించుకున్నాడు. అతనికి నెలకు ఎంతోకొంత చెల్లించి తన పనులు చక్కబెట్టుకుంటున్నాడు. సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని పలువురు ల్యాబ్‌టెక్నీషియన్లు పేర్కొంటున్నారు. డీఎంహెచ్‌ఓ పరిధిలోని ఉద్యోగులు రిమ్స్ పనిచేస్తున్న వారికి ఆర్‌ఎంఓ డ్యూటీ సర్టిఫికెట్ అందజేస్తారు. ఆ అటెండెన్స్ ఆధారంగా జిల్లా వైద్యారోగ్య శాఖ ద్వారా వేతనాలు చెల్లిస్తోంది. ఈ విషయమై డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్‌ను వివరణ కోరగా, తన దృష్టికి రాలేదని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

భూమి కబ్జా చేసిన ఏడుగురు అరెస్టు

భీమిని: ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన ఏడుగురిని శనివారం అరెస్టు చేసినట్లు కన్నెపల్లి ఎస్సై గంగారాం తెలిపారు. కన్నెపల్లి మండలం రెబ్బెన శివారు సర్వేనంబర్ 248 గల ప్రభుత్వ భూమిని మేసినేని చంద్రయ్య, రాజుకుమార్, గట్టు అంకులు, దిలీప్, కాంతయ్య, రామకృష్ణ, రాజుకుమార్ కబ్జా చేసి అందులో చెట్లు నరికివేశారు. తహసీల్దార్ శ్రావణ్ కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దొంగల ముఠా అరెస్ట్

- బ్యాంక్‌లో గ్యాస్ కట్టర్లతో చోరీకి యత్నం
- తొమ్మిది మందిపై కేసు
- ముగ్గురి అరెస్టు, పరారీలో ముగ్గురు
- వేరే కేసుల్లో ఇప్పటికే జైలులో మరో ముగ్గురు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: బ్యాంక్‌కు కన్నం వేసి గ్యాస్ కట్టర్లతో చోరీకి యత్నించిన దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఆదిలాబాద్‌రూరల్ మండలం రామాయి గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో గతేడాది డిసెంబర్ 12న లోనికి చొరబడ్డారు. బ్యాంక్‌లో అమర్చిన మిషన్ డిటెక్షన్ అలారమ్ మోగడంతో పారిపోయారు. ఈ కేసుకు సంబంధించి 9 మంది చోరీకి పాల్పడగా ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఆయా కాలనీలకు చెందిన వారు ఓ ముఠాగా ఏర్పడ్డారు. జల్సాలకు అలవాటుపడి పలు నేరాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో బ్యాంక్‌లో చోరీకి యత్నించారు. అలారం మోగడంతో పారిపోయారు. 9 మందిపై కేసులు నమోదు చేయగా, ముగ్గురు పరారీలో ఉన్నారని, మరో ముగ్గురు వివిధ కేసుల్లో ఇదివరకే జైలులో ఉండగా, ప్రస్తుతం ముగ్గురిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

నిందితులు వీరే..

ఆదిలాబాద్‌రూరల్ మండలం కచ్‌కంటి శివారులో పోలీసులకు ముగ్గురు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. వారిని పట్టుకుని పోలీసులు విచారించగా చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి సిలిండర్, గ్యాస్ కట్టర్, గడ్డపార స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. దగడ్ సాయి, అశోక్, మినుగు రాజేశంను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. పుష్ప అలియాస్ పవన్, మణికంఠ, జాదవ్ రాజు పరారీలో ఉన్నారని తెలిపారు. చవాన్ రవి, సుఖ్‌దేవ్ సన్నీ, గోవిందుడు కార్తీక్‌లు హత్యాయత్నం, మర్డర్ కేసులు, రౌడీ షీట్ నమోదై ప్రస్తుతం జైలులో ఉన్నారు. ఈ 9 మందిపై ఆదిలాబాద్‌రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు వివరించారు. మిగతా వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, రూరల్ సీఐ ఫణిందర్, ఎస్సై ముజాహిద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

- 15 మంది ప్రయాణికులకు గాయాలు
- తీవ్రంగా గాయపడిన బస్సు డ్రైవర్, కండక్టర్
- క్యాబిన్‌లో ఇరుక్కున్న లారీ డ్రైవర్
- జేసీబీతో బయటకు తీసి ఆస్పత్రికి తరలింపు
- చికిత్స పొందుతూ మృతి


నుజ్జునుజ్జయిన లారీ, బస్సు


లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ శ్రీను


లారీడ్రైవర్ శ్రీను మృతదేహం

నిర్మల్/నర్సాపూర్(జి): నర్సాపూర్(జి) మండలంలోని తురాటి గ్రామ ఎక్స్‌రోడ్ వద్ద 61వ జాతీయ రహదారి వద్ద శనివారం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 15 మంది ప్రయాణికులకు గాయాలు, బస్సు డ్రైవర్ లతీఫ్, కండక్టర్ జంగం సుధారాణికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు లోకేశ్వరం మండలం రాజురా నుంచి నిర్మల్ వెళ్తోంది. నిర్మల్ నుంచి కెమికల్ లోడ్‌తో భైంసా వైపు వెళ్తున్న లారీ ఓవర్‌టేక్ చేసేక్రమంలో ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొంది. ప్రమాద సమయంలో బస్సులో 37 మంది ప్రయాణికులు ఉండగా 15 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో నిర్మల్, భైంసా ఏరియా ఆసుపత్రులకు తరలించారు. లక్ష్మి, భోజవ్వ, గంగవ్వ, రాజేశ్వరి, గణేశ్, సరస్వతి, సజన్ తదితరులు చికిత్స పొందుతున్నారు. లారీ క్యాబిన్‌లో డ్రైవర్ గజ్జల శ్రీను ఇరుక్కుపోయి గంటసేపు నరకయాతన అనుభవించాడు. జేసీబీ సాయంతో బయటకు తీసి 108లో నిర్మల్ ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు లారీ డ్రైవర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల వాసిగా గుర్తించారు. నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా, భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ, ఎస్సై సాయికిరణ్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. నిర్మల్ డిపో మేనేజర్ పండరి, ఆర్టీసీ అధికారులతో ఘటన స్థలాన్ని పరిశీలించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. పాముకాటుతో చిన్నారి, దుబాయిలో యాకర్‌పల్లి వాసి అనారోగ్యంతో, విద్యుత్ షాక్‌తో వృద్ధురాలు, తాటి చెట్టు పైనుంచి జారిపడి ఒకరు మృతిచెందారు.

పాముకాటుతో చిన్నారి


ఉదయశ్రీ మృతదేహం

లక్సెట్టిపేట: పాము కాటుకు గురై చిన్నారి మృతిచెందిన ఘటన మండలంలోని వెంకట్రావుపేటలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. వెంకట్రావుపేటకు చెందిన వందన-సుధాకర్ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. తండ్రి సుధాకర్ హోటల్‌లో పని చేస్తుండగా, తల్లి వందన కూలీ పని చేస్తోంది. వీరి చిన్నకుమార్తె ఉదయశ్రీ(4) శనివారం సాయంత్రం ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా ఆమె కాలిపై పాము కాటేసింది. గమనించిన కుటుంబీకులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

దుబాయిలో యాకర్‌పల్లి వాసి మృతి

సారంగపూర్: బతుకుదెరువు కోసం దుబాయి వెళ్లిన యాకర్‌పల్లి వాసి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని యాకర్‌పల్లి గ్రామానికి చెందిన నిర్మల రాజు (41) రెండేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయిలోని జెబ్లాలీ ఏరి యాలో గల వేడామ్స్ కంపెనీలో కూలీ పని చేసేందుకు వెళ్లాడు. గతనెల క్రితం అనారోగ్యానికి గురి కాగా తోటి మిత్రులు ఆసుపత్రిలో చేర్పించారు. అయితే చికిత్స పొందుతూ ఈనెల 7న మృతి చెందాడు. మృతుడికి భార్య రుక్మవ్వ, కుమారుడు అఖిల్(16), కుమార్తె శృతి(9)లు ఉన్నారు. ప్రభుత్వం ఆయన మృతదేహాన్ని త్వరగా రప్పించేలా ఏర్పాట్లు చేయాలని కుటుంబీకులు వేడుకుంటున్నారు.

విద్యుత్‌షాక్‌తో వృద్ధురాలి

దండేపల్లి: మండలంలోని ముత్యంపేటకు చెందిన వృద్ధురాలు ముత్తె రాజవ్వ (70) శనివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ఎస్సై తహాసీనొద్దీన్ కథనం ప్రకారం.. రాజవ్వ ఇంటి వెనకాల గల పెరటిలో కూరగాయల తోటలోకి కోతులు రావడంతో వాటిని కొట్టేందు కు వెళ్లింది. ఇంట్లోకి తిరిగి వచ్చేక్రమంలో ఇంటి ముందు ఉన్న కూలర్ వైరు తెగిపడి ఉంది. గమనించకుండా వస్తుండగా వైరు ఆమె కాలికి తగిలింది. వైర్‌కు విద్యుత్ సరఫరా అయి షాక్‌తో కిందపడిపోయింది. గమనించిన భర్త రాయలింగయ్య, చుట్టుపక్కల వారిని పిలిచి కరెంట్ ఆఫ్ చేసి చూసేసరికి చనిపోయింది. భర్త ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి

కోటపల్లి: తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతిచెందిన ఘటన మండలకేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాలు.. వేమనపల్లి మండలం దస్నాపూర్‌కు చెందిన తాళ్లపల్లి రాకేశ్ (30) శుక్రవారం సాయంత్రం కోటపల్లిలో కల్లు గీసేందుకు తాటి చెట్టెక్కాడు. ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. తీవ్రగాయాలైన అతన్ని చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల నుంచి కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి తండ్రి చిన్నతనంలో మరణించగా కుటుంబాన్ని రాకేశ్ పోషిస్తున్నాడు. తల్లి పద్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కన్న కొడుకునే కడతేర్చిన తండ్రి ?

- విద్యుత్ షాక్ పెట్టి చంపేసి..
- వాగులో పడేసి పోలీసులకు ఫిర్యాదు
- ఆస్తి వివాదమే కారణమని ప్రచారం


జయేందర్(ఫైల్)

సిర్పూర్(టి): మండలంలోని టోంకిని గ్రామానికి చెందిన చౌదరి జయేందర్(19)ను భూ పంపిణీ వివాదంలో కన్న తండ్రే కడతేర్చాడనే ప్రచారం జరుగుతోంది. గతకొంత కొంతకాలంగా భూమి, ఆస్తులపై వివాదం ఉండడమే అందుకు కారణంగా తెలుస్తోంది. ఈ నెల 9న ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన కుమారుడు జయేందర్ తిరిగి రాలేదని తండ్రి చౌదరి చిరంజీవి సిర్పూర్(టి) పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈనెల 10న పోలీసులు విచారణ చేపట్టగా యువకుడి ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం హనుమాన్ జయంతికి టోంకిని హనుమాన్ ఆలయానికి వచ్చిన భక్తులు పెన్‌గంగ నదిలో స్నానానికి వెళ్లగా మృతదేహం కనిపించింది. సిర్పూర్(టి) ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి జయేందర్ తల్లిదండ్రులను పిలిచి విచారించగా తమ కుమారుడే అని గుర్తించారు. కాగా, ఈ నెల 10న టోంకిని స మీపంలోని తమ స్వంత పొలంలో అడవి పందులు రాకుండా విద్యుత్తు వైర్లు అమర్చగా ప్రమాదవశాత్తు తగిలి జయేందర్ మృతిచెందాడని, తమపై కేసులు నమోదు అవుతాయనే భయంతో సమీపంలో ఉన్న పెన్‌గంగలో మృతదేహాన్ని పడవేసి పోలీసుస్టేషన్‌లో అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేశారనీ ప్రచారం జరుగుతోంది. మంచిర్యాల ఫోరెన్సిక్ వైద్య నిపుణులతో పోస్టుమార్టం నిర్వహించామని, ఆదివారం పోస్టుమార్టం నివేదిక వచ్చిన అనంతరం వివరాలు వెల్లడిస్తామని ఎస్సై తెలిపారు.

భారత్ గౌరవ్ వేసవి ప్రత్యేక రైళ్లు

- ఈనెల 23 నుంచి మే 2 వరకు హరిద్వార్ రిషికేశ్-వైష్ణోదేవియాత్ర
- అతి తక్కువ ధరలతో దైవ దర్శనాలు
- మంచిర్యాల స్టేషన్‌లో హాల్టింగ్


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టూరిజం మానిటర్లు

మంచిర్యాలఅర్బన్: దేశంలోని వివిధ పుణ్యక్షేత్రాల దర్శనానికి భారత్ గౌరవ్ పేరిట వేసవి ప్రత్యేక రైళ్లను ఐఆర్‌సీటీసీ అందుబాటులోకి తీసుకువచ్చిందని టూరిజం మానిటర్లు ప్రశాంత్, శ్రీకాంత్ తెలిపారు. మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో పుణ్యక్షేత్రాలు, ప్యాకేజీలు, రైళ్ల వివరాలకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొత్తం నాలుగు ప్యాకేజీలుగా ఈనెల 23 నుంచి జూన్ 12వరకు ప్రత్యేక రైళ్లు నడుస్తాయన్నారు. 23 నుంచి మే 2 వరకు ప్యాకేజీ-1లో గురుకృప రైలు ద్వారా హరిద్వార్ రిషికేష్-వైష్ణోదేవి యాత్ర అతి తక్కువ టికెట్ ధరలతో దైవదర్శనాలు చేసుకోవచ్చన్నారు. పది రోజులు కొనసాగే యాత్రలో భాగంగా విజయవాడ నుంచి బయల్దేరనున్న రైలు గుంటూరు, నల్గొండ, సికింద్రాబాద్, కాజీపేట్ మీదుగా కాగజ్‌నగర్, బల్లార్షా, వార్ధా నాగపూర్ మీదుగా వెళ్తుందన్నారు. ఈ ఏడాది భక్తుల సౌకర్యార్థం పెద్దపల్లి, మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో నిలుపుదల (హాల్టింగ్) అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ఈనెల 25న హరిద్వార్ చేరుకుంటుందని అక్కడి నుంచి బస కేంద్రానికి తరలిస్తారన్నారు. మానసదేవి ఆలయ దర్శనం, గంగాహారతి, 26న రిషికేష్ చేరుకుని గంగాస్నానాలు, రామ్‌జూలా, లక్ష్మణ్‌జూలా, రాత్రి 9 గంటలకు ఆనంద్‌సాహెబ్‌కు బయల్దేరుతుందన్నారు. 27న గురుద్వారా, నైనాదేవి, ఆలయ సందర్శన రాత్రి 10 గంటలకు అమృత్‌సర్‌కు వెళ్తుందన్నారు. 28న హర్మిందర్ సాహెబ్, అకల్‌తక్తా వాఘా సరిహద్దు సందర్శన, అనంతరం రాత్రి 10 గంటలకు అమృతసర్ నుంచి మాతావైష్ణోదేవి కాట్రాకు రైలు వెళ్తుందని పేర్కొన్నారు. ఎకానమీ స్లీపర్, థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ బోగీలు ఉన్నాయన్నారు. ఈ యాత్రలో భాగంగా ప్రయాణికులకు ఉదయం టీ, అల్పాహారం, లంచ్ డిన్నర్ ఉంటుందని పేర్కొన్నారు. రైలులో టూరిస్ట్ ఎస్కార్ట్‌ల తోపాటు పర్యటన సమయంలో టూర్ మేనేజర్లు ఉంటారని వివరించారు. ప్యాకేజీ-2లో కాశీ గయ, ప్రయోగ అయోధ్య, (సరస్వతి పుష్కరాల ప్రత్యేకం), మే 8 నుంచి 17 వరకు, ప్యాకేజీ-3లో అరుణాచలం-మధురై-రామేశ్వరం మే 22 నుంచి 30 వరకు, ప్యాకేజీ-4లో పంచ జ్యోతిర్లింగాల యాత్ర జూన్ 4నుంచి 12 వరకు ప్రారంభమవుతుందన్నారు. వివరాలకు 040-27702407, 9701360701, 9281030711, 9281030712, 9281030749, 9281030750 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

కడెం: మండలంలోని పెద్దబెల్లాల్ పంచాయతీ పరిధిలోని మొర్రిగూడెం గ్రామానికి రాసూరి అనూష (21) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. గ్రామస్తులు, ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. అనూష డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. ఈమె తల్లిదండ్రులు సుజాత-రాజేశ్వర్ వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈనెల 11న ఎవరూ లేని సమయంలో ఇంటి సమీపంలోని రేకుల షెడ్డులో చున్నీతో అనూష ఉరేసుకుంది. తండ్రి ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసుకని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గంజాయితో నలుగురు అరెస్ట్

నెన్నెల: నిషేధిత గంజాయితో నలుగురు యువకులు పట్టుబడినట్లు నెన్నెల ఎస్సై ప్రసాద్ తెలిపారు. కొందరు యువకులు జెండావెంకటాపూర్ శ్మశాన వాటిక వద్ద గంజాయి సేవిస్తున్నారని అందిన పక్కా సమాచారంతో శనివారం దాడి చేసినట్లు పేర్కొన్నారు. జెండావెంకటాపూర్‌కు చెందిన ఏసూకరి శశికుమార్, దుర్గం సిద్ధూ, భీమారం మండలం కాజిపల్లికి చెందిన కుంటాల కీర్తివర్ధన్, జగతి మనోహర్‌లు పట్టుబడ్డారని చెప్పారు. వారి వద్ద 250 గ్రాముల గంజాయి లభించిందన్నారు. గంజాయితోపాటు వారి నుంచి ఒక రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని వివరించారు.

మందమర్రిలో..


మందమర్రిరూరల్: పట్టణంలోని దీపక్‌నగర్‌లో ఓ ఇంట్లో 12 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గంజాయి మొక్కలను పెంచుతున్నారనే పక్కా సమాచారంతో సిబ్బందితో కలిసి శనివారం ఇంట్లో తనిఖీ చేయగా 12 గంజాయి మొక్కలు లభ్యమయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకుని బాలుడి (16)ని అదుపులో తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పక్కా సమాచారం అందించిన హెడ్ కానిస్టేబుల్ రాము, కానిస్టేబుల్ శ్రీనివాస్‌కు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి అభినందించి రివార్డు అందించారు.

కంటెగాంలో

బోథ్: మండలంలోని కంటెగాంలో ప్రభు పెందూర్ ఇంట్లో గంజాయిని శనివారం పట్టుకున్నట్లు సీఐ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. తమకు అందిన సమాచారంతో ప్రభు పెందూర్ ఇంట్లో తనిఖీ చేయగా రూ.36,250 విలువ గల కిలో 450 గ్రాముల గంజాయి లభ్యమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గంజాయి, నిందితుడిని పట్టుకున్న ఎస్సై ప్రవీణ్ కుమార్, కానిస్టేబుళ్లు అంబాజీ, రంజిత్ కుమార్, నరేశ్‌లను డీఎస్పీ జీవన్‌రెడ్డి అభినందించారు.

ప్రాణాలు తీసిన చేపల వేట

- ప్రమాదవశాత్తు వాగుకుంటలో పడి ఇద్దరి మృతి
- మృతులిద్దరూ బావ బామ్మర్దులు



మృతులు షాదుల్లా, రఫీక్

నందిపేట్(ఆర్మూర్): చేపల వేట సరదా ఇద్దరి ప్రాణాలను బలిగొంది. ప్రమాదవశాత్తు బావ బామ్మర్దులు ఇద్దరు నీట మునిగి చనిపోయిన ఘటన నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం సిద్దాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నిర్మల్ జిల్లాకు చెందిన షేక్ షాదుల్లా(46) తన కుటుంబంతో కలిసి 18 ఏళ్ల క్రితం ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి వచ్చి మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కడప జిల్లా పొద్దుటూర్‌కు చెందిన అతని బావమరిది మహమ్మద్ రఫీక్ (47) రంజాన్ పండుగ సందర్భంగా వారం క్రితం మచ్చర్లకు వచ్చాడు. కాగా, శుక్రవారం సాయంత్రం సరదాగా చేపలు పట్టేందుకు ఇద్దరూ కలిసి నందిపేట మండలంలోని సిద్దాపూర్ శివారులోని చిన్న వాగు సంబంధించిన మునికుంటకు వెళ్లారు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు రఫీక్ కాలు జారి కుంటలో పడిపోయాడు. దీంతో అతనిని రక్షించేందుకు షాదుల్లా కుంటలోకి దిగాడు. ఇద్దరికీ ఈత రాకపోవడం, మునికుంటలో లోతు ఎక్కువగా ఉండడంతో నీట మునిగి మృతి చెందారు. మృతుడు షేక్ షాదుల్లా కొడుకు షేక్ సులేమాన్ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.